# పోవాలనివుంది!

సాయంత్రం ఆరు గంటలకే రాత్రి భోజనం చేయటం అలవాటయి పోయింది పాతికేళ్ళ అమెరికా జీవితంలో. అందులోనూ వేసవికాలం అవటంతో, బయట వెలుతురు కూడా రాత్రి తొమ్మిది గంటలదాకా వుంటుంది. మొక్కలకి నీళ్ళు కూడా పోసి, ఎనిమిదింటికి అలా వాకింగ్‌కి బయల్దేరాం నేనూ శ్రీమతీ. నాలుగిళ్ళు దాటగానే మా నడక ఆగిపోయింది. ఎడ్ ఒక హోస్ పైప్ పట్టుకుని గులాబీ మొక్కలకి నీళ్ళు పెడుతున్నాడు. మమ్మల్ని చూసి నవ్వుతూ ముందుకి వచ్చి పలకరించాడు.

'మీ అమ్మగారు ఎలా వున్నారు?' అని అడిగింది శ్రీమతి.

అతను ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి, 'ఎలా వుంటుంది. ఇంకా కోమాలోనే వుంది. కోమాలోకి వెళ్ళి ఇవాళ్టికి సరిగ్గా రెండు నెలలయింది. లైఫ్ సపోర్ట్ సిష్టం మీద ప్రాణం అలా నిలిచి వుంది. డాక్టర్లు అనటం, వాళ్ళిక చేసేదీ చెయ్య గలిగిందీ ఏమీలేదనీ, మేం ఎప్పుడు లైఫ్ సపోర్ట్ సిష్టంని తీసేయమంటే అప్పుడు తీసేస్తామనీ అంటున్నారు. నాకూ అదే మంచిదనిపిస్తుంది. హాస్పిటల్‌కి డబ్బులు కట్టలేక కాదు. ఇన్సూరెన్స్ వాళ్ళే చాలవరకూ పే చేస్తారు. కానీ నా చెల్లెలు ఒప్పుకోవటం లేదు. చూస్తూ చూస్తూ అమ్మ ప్రాణం తీసేస్తామా అంటుంది' అన్నాడు.

'పోనీ ఇంకో డాక్టర్ దగ్గర రెండో అభిప్రాయం తీసుకుంటే... ' అన్నాను.

అతను చిన్నగా నవ్వి, 'అదీ చేశాం. వాళ్ళూ అదే అన్నారు. ఆవిడకి ఊపిరి ఆడుతున్నది కనుక, చట్టరీత్యా బ్రతికివున్నట్టే తప్ప నిజానికి ఆవిడ చనిపోయి నట్టేను. ఏ డాక్టరూ, మందులూ ఇక ఏమీ చేయలేవు అన్నారు. అంతేకాదు ఈ పరిస్థితిలో ఎవరైనా ప్రాణం నిలబెట్టటం కన్నా ఆ ప్రాణికి విముక్తి కలిగించటమే మంచిదంటారు. కానీ నాకే ఏమీ పాలుబోవటం లేదు. ఏం చేయాలా అని పెద్ద సంధిగ్దంలో పడ్డాను' అన్నాడు.

అతనికి షేక్ హేండ్ ఇస్తే, నా చేయిని వదలకుండా నన్ను కావలించు కున్నాడు. అతని భుజం మీద నెమ్మదిగా తట్టి, 'ధైర్యంగా వుండు' అని అక్కడినించీ బయల్దేరాం.

0 0 0

ఆ మధ్య మాకు తెలిసిన ఒక మెక్సికన్ అమ్మాయి, కారు ప్రమాదంలో ఇరుక్కుంది. ఇరుక్కోవటమంటే, నిజంగానే రెండు కార్లు ఢీకొంటే వాటి రెండిటి మధ్యా ఇరుక్కుంది. తలకి పెద్ద గాయాలు తగిలాయి. అక్కడికక్కడే స్పృహ తప్పింది. వెంటనే హాస్పిటల్‌కి చేర్చారు. ఇంకా ఊపిరి ఆడుతున్నది కనుక ఆక్సిజన్ మీద పెట్టారు.

ఆ అమ్మాయికి వాళ్ళమ్మ పదహారేళ్ళ వయసు (స్వీట్ సిక్స్టీన్) పార్టీకి సన్నాహాలు చేస్తుండగా జరిగిందిది. తెలివైన చక్కటి పిల్ల. హైస్కూల్లో చదువు కుంటున్నది.

రెండు నెలలు గడిచినా ఆ అమ్మాయి తెలివిలోకి రాలేదు. ఆమెని ఒకరు కాదు, ఎంతో మంది స్పెషలిస్టులు పరీక్షించి 'ఇక ఈ అమ్మాయిని బ్రతికించటం కష్టం. ఎన్నడూ జరగని ఏదో అద్భుతం జరిగితే తప్ప, దాదాపు అంతా అయిపోయి నట్టే. ఒకవేళ బ్రతికినా ఎన్నో ఎముకలు విరిగిన ఈ పిల్ల మామూలుగా బ్రతకటం, తన పనులు తను చేసుకోగలగటం అసంభవం' అన్నారు.

వాళ్ళమ్మ ఆ అమ్మాయిని లైఫ్ సపోర్ట్ సిస్టం మీదనించీ తప్పించటానికి ఒప్పుకోలేదు.

'ముఖానికి ఎన్ని కట్లు కట్టినా ఆ అందమైన ముఖం చూడండి. ఆ చిలిపి కళ్ళల్లో ఎంతో ధృడమైన ఆత్మ విశ్వాసం కనపడటంలేదూ... నేను ఏమాత్రం ఒప్పుకోను. అది బ్రతుకుతుంది. నాకు తెలుసు' అని పట్టుపట్టింది.

అలా నెలలు గడిచినా, ఒక సంవత్సరం అయినా కూడా ఏమీ మార్పు రాలేదు. శ్రేయోభిలాషులందరూ చెప్పినా ఆ తల్లి మనసు వినలేదు. అలాగే నెలలు గడుస్తున్నాయి.

డాక్టర్లు ఏ అద్భుతమో జరిగితేనో తప్ప ఆ అమ్మాయి స్పృహలోకి రాదన్నారో, ఆ అద్భుతమే జరిగింది!

ఆ పిల్ల ఒకరోజు పొద్దున్నే కళ్ళు తెరిచింది!!

అందర్నీ గుర్తు పట్టి, పేరు పేరునా పలకరించింది!!!

0 0 0

ఈ పై రెండూ కథలు కాదు. నిజంగా జరిగినవే. మొదటిది ఎన్నోసార్లు ఎన్నో చోట్ల జరిగిందీ, జరిగేదే. రెండోది ఎవరు చెప్పినా నేను నమ్మి వుండేవాడిని కాదు. మా వూళ్ళో మాకు తెలిసిన వాళ్ళకే జరిగిన... నిజంగానే ఒక అద్భుతం.

ఇటువంటి వార్తలు విన్నప్పుడు, మనల్ని ఒక క్లిష్ట పరిస్థితిలో పడేస్తాయి. మనకి ఎంతో కావలసిన వాళ్ళు, ఆ పరిస్థితిలో అలాటి నిర్ణయాన్ని మనకే వదిలేస్తే, మనం ఎలాటి నిర్ణయం తీసుకోగలం?

కొన్ని సందర్భాల్లో ఇంకొక రకమైన సమస్య ఎదురవుతుంది. రోగి లైఫ్ సపోర్ట్ సిస్టం మీద లేకుండా, మంచం మీద వున్నాడనుకోండి. స్పృహలో వుండవచ్చు, లేకపోవచ్చు. డాక్టర్లు 'ఇక చేసేదేమీలేదు, ఆ మరణ ముహూర్తం కోసం ఎదురు చూడవలసిందే' అన్నారనుకోండి. అప్పుడు మనకి ఆత్మీయుమైన రోగి, మన కళ్ళల్లోకి చూస్తూ - 'నేనిక ఈ బాధ భరించలేను. నన్ను పోనీయండి' అంటే మనం ఏం చేయగలం?

దానికి సమాధానం చూపించాడు డాక్టర్ కవోర్కియన్ అనే ఆయన. అలా ప్రాణం తను పోకుండా తమ ప్రాణం తీస్తున్నప్పుడు, ఆ బాధ భరించలేక 'నాకు పోవాలని వుంది' అంటే ఆయన బాధపడేవాడు. అలాటివారికి ఆ బాధ తెలీకుండా

వారి శారీరిక బాధనీ, మనో వేదననీ తీర్చేవాడు. దాన్ని మెర్సీ కిల్లింగ్ అంటారు ఇంగ్లీషులో.

ఆయన ఈ సహాయ కార్యక్రమం మొదలుపెట్టాక, అమెరికాలో రెండు రకాల వాదనలు మొదలయాయి.

ఒకటి ఆయన ఎంతోమందికి వేదననీ, ఆవేదననీ తీరుస్తున్నాడనీ, ఆయన ఋణం తీర్చుకోలేమనీ. అలా అన్నవారెవరో తెలుసా? ఆయన చేతిలో విముక్తి పొందినవారూ, తమ ఆత్మీయుల శారీరిక మానసిక బాధకి ఆయన ద్వారా సహాయం పొందినవారూ, మానవతా వాదులూ.

రెండవది అలా చేయటం పాపం అనీ, చట్టరీత్యా హత్య అవుతుందనీ, అది శిక్షార్హమనీ. అంతేకాదు కొంతమంది డాక్టర్ కొవార్కియన్ మీద కేసులు పెట్టి, ఆయన్ని ఆ హత్యలు ఆపమని గొడవ పెట్టారు. ఆయన వారి మాట వినకుండా తను చేసే 'మానవసేవ' కొనసాగించటానికే నిర్ణయించుకున్నాడు. ఇంతకీ ఈ వాదన చేసిన వారెవరు? మత సంబంధమైన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పనిచేస్తున్నవారూ, కొందరు రాజకీయ నాయకులూ, కొందరు న్యాయవాదులూ.

ఇక్కడ ఎవరి వాదన అర్థవంతమైనదీ అనేది, ఆయా మనుష్యుల అభిప్రాయాలనిబట్టీ, అవసరాలనిబట్టీ, వారి అభినివేశాన్నిబట్టీ వుంటుంది. అందుకని ఈ విషయం మీద ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి.

0 0 0

ఆరోజు మా సాయంత్రపు నడక కొనసాగిస్తూ ఇంటికి వస్తున్నప్పుడు అన్నది శ్రీమతి 'ఇలాటి క్లిష్టమైన పరిస్థితుల్లో మనమే ఇరుక్కుంటే, మనవాళ్ళకి మనల్ని లైఫ్ సపోర్ట్ మీద వుంచాలా, వద్దా అనే సమస్య రాకూడదు. అలాటి విషయాల్లో వాళ్ళు అటా ఇటా అని కొట్టుమిట్టాడకుండా మా వర్క్‌లో మోనికా ఏం చేసిందో తెలుసా?' అంది.

కుతూహలంగా అన్నాను ఏం చేసిందేమిటి అని.

'మోనికా, వాళ్ళాయనా తమ వీలునామాలో వ్రాశారుట... అలాటి పరిస్థితే కనుక వస్తే, అలా ఒక కళేబరంలా బ్రతకటం తమకిష్టం లేదనీ, తమని లైఫ్ సపోర్ట్‌నించీ తప్పించమనే తమ కోరికనీ, అది నెరవేర్చవలసిన బాధ్యతని పిల్లలకి అప్పగిస్తున్నామనీ వ్రాశారుట. అంతేకాదు పిల్లలందరికీ అదే విషయం ముఖాముఖీ చెప్పారుట కూడాను' అన్నది.

ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే అన్నాను - 'అవును. నాకు బాగా నచ్చిందది. పిల్లల్ని తర్వాత మానసికంగా ఇబ్బంది పెట్టే కన్నా, ఇది చాల నయం కదూ' అన్నాను.

'మనం కూడా అలాగే చేద్దామా...' అంది శ్రీమతి తన కోరిక పైకి చెబుతూ.

అదే నా కోరిక కూడా కనుక, 'తప్పకుండానూ' అన్నాను.

0 0 0